బుర్ర కొట్టాడు, కాలితో కుమ్మాడు, అందిన చోటల్లా చితక బొడుస్తూ—"ఏఁవే నంజా గోరోజనం బలిసిందా—ఎవుడి ననుకుంటున్నావే. నీ మొగుడ్ని—కూడొం డవూ—ఎల్లి ఎల్లి కర్రపుల్లలట్టుకొచ్చి నీళ్ళు కాగబెట్టి, కూడొండు-నోరిప్పావంటే ఎముక లేరేస్తా—జవాబు సెప్పావంటే పచ్చడిచేసి నంజుకుతినేస్తా—" బండ బూతులుతిట్టాడు.

"ఓరి నచ్చినోడూ—నీ చేతులిరగ... సిగ్గునేదురా ఆడకూతురు తెచ్చిన కూడు మింగుతూనే కొడ్తావురా" ముత్యాలు ఏడుస్తూ తిట్టసాగింది. ముత్యాలు అరుస్తున్న కొద్దీ సింహాచలం మరింత చితక బొడిచాడు. ముత్యాలు ఆఖరికి యింక తాలలేక ఏడుస్తూ కూలబడింది—"ఊఁ—లే—వళ్ళు, తీట వదిలిందా-లే, కూడెట్టు—" సింహాచలం అలిసిపోయి మంచానికి అడ్డం పడ్డాడు. ముత్యాలు ఏకిలుకు ఆకిలు కూడ దీసుకుంటూ మొద్దయిన వళ్ళుని పొయ్యిముందుకు చేర్చింది.

* * *

తెల్లారి ఏడుగంటలయినా రాని ముత్యాలు కోసం పదిసార్లు కాలుగాలిన పిల్లిలా తిరిగింది రాధ—ఏడుగంటలు దాటాక అంట్లు గిన్నెలు ముందేసుకు తోమ డానికి కూర్చుంది ముత్యాలుని తిట్టుకుంటూ రాధ—"దొంగముండ—ఎప్పుడూ ఏదోవంకతో ఎగగొడ్తుంది-అన్నీ దొంగవేషాలు యిదీనూ—అందుకే ఆ మొగుడు చితక్కొడ్తాడు—పూరికేకొడ్తాడా, కావల్సిందే దానికి...." పరపర గిన్నెలు తోముతూ కసిగా తిట్టింది రాధ—

★

(మ హి ళ)

# తల్లి హృదయం

క్రొడుకు దగ్గరనుంచి ఉత్తరం అందుకున్న కామేశ్వరమ్మ మనసు శరీరం భూమ్మీద నిలవడం మానేశాయి. మూడేళ్ళ తర్వాత పెళ్ళయ్యాక ఇన్నాళ్ళకి కోడలు, మనవరాలుతో ఇంటికి వస్తున్నాడు. ఒక్కగానొక్క కొడుకు ఇంజనీరింగు ప్యాసయ్యాక భిలాయి స్టీలుప్లాంటులో ఉద్యోగం దొరకడంతో వెళ్ళినవాడు మళ్ళీ ఇంటికి వంటరిగా రాలేదు. తనతోపాటు ఇంజనీరింగు చదివిన బెంగాలీ అమ్మాయిని

రిజిష్టర్ మ్యారేజి చేసుకుని, చేసుకున్నాక చెప్పిపోవడానికన్నట్టుగా చుట్టపు చూపుగా వచ్చాడు మూడేళ్ళక్రితం.

ఆ రోజు మూడేళ్ళక్రితం జరిగినా ఇంకా ఆవిడ కంటికి ఆ దృశ్యం ఆ రోజు జరిగినట్టే కనిపిస్తూంది. ఇద్దరాడపిల్లల తర్వాత ఆరేళ్ళకి అపురూపంగా పుట్టిన కొడుకు, తల్లి తండ్రి బ్రతికున్నా ఇలా చేసుకుంటున్నానని ఒక్క మాటన్నా చెప్ప కుండా తమ భాష, కులంగాని అమ్మాయిని పెళ్ళి చేసుకుని ఇంటికితెచ్చి మీ కోడలు అంటే ఆ షాక్‌కి ఏ తల్లి తండ్రి తట్టుకోలేరు. శుభమా అని కొత్తకోడలు నట్టింట అడుగుపెట్టిన ఆ రోజు ఇంట్లో శ్మశాన నిశబ్దం ఆవరించింది. రాఘవరావుగారైతే రెండునిముషాలు కొయ్యబారినట్టు స్థాణువులా నిలబడి ఒకసారి కొడుకు కోడలువంక చూసి మాట పలుకులేకుండా తన గదిలోకిపోయి తలుపులు మూసుకున్నారు. ఆ మూసిన తలుపు వాళ్ళు వెళ్ళేవరకూ తీయలేదు. కామేశ్వరమ్మకి కాళ్ళు చేతులు ఆడలేదు. ఏం చెయ్యాలో, ఏం అనాలో తోచలేదు. పక్కన ముక్కు మొహం తెలియని కోడలు అనబడే అమ్మాయినిచూస్తూ కొడుకుని ఏం అనాలో ఏం తిట్టాలో తన నెత్తి బాదుకుని ఏడవాలో మేం చచ్చామనుకున్నవాడివి మళ్ళీ ఎందుకొచ్చావు అని మొహం మీదే తలుపు వేయాలా, భర్త అలా మాట పలుకులేకుండా లోపలికి వెళ్ళిపోతే తను వాళ్ళని లోపలికి పిల్చి మర్యాద చెయ్యాలా, చేస్తే భర్త ఏం అంటాడో....రెండు నిముషాలు ఆవిడ అయోమయస్థితిలో పడిపోయింది.

"ఏం అమ్మా నాన్నగారి జవాబే నీదని మమ్మల్ని వెళ్ళిపొమ్మన్నావా! నాకు తెల్సు మీరిలా అవమానం చేస్తారని, రాకూడదనుకున్నాను, ఓ ఉత్తరం రాసిపడేద్దా మనుకున్నాను, కన్నవాళ్లుగదా అని వస్తే కోడలికి మంచి స్వాగతమే చెప్పారు. అసలు బబిత రాననే అంది, వచ్చినందుకు బాగానే బుద్ధిచెప్పారు." కోపంగా అంటున్న కొడుకుని తెల్లబోయిచూసింది. ఒక్క నిమిషంలో కూడగట్టుకుంది. "మేమింకా బతికున్నామని చూడడానికి వచ్చినందుకు సంతోషం నాయనా, కన్న వాళ్ళం కనక పిల్లల్నించి ఏదో ఆశిస్తాం. కన్నందుకు చదువు చెప్పించి ప్రయోజ కుడిని చేశారు మీ డ్యూటీ అయిపోయింది, పెళ్ళికి మీ ప్రమేయంలేదు. ఉండదు అని సూచాయగానైనా ముందు చెబితే ఈ రోజు మేమింత షాక్ తినేవాళ్ళంకాదు. ఏదో వంశోద్ధారకుడు ఒక్కగానొక్క కొడుకు, అనేక సంబంధాలు వస్తున్నాయి మంచి అయినింటి అమ్మాయినిచూసి ముచ్చటగా పెళ్ళి చేద్దాం అని ఏ తల్లితండ్రు లన్నా ఆశపడితే అది అత్యాశంటావా. అలా జరగనపుడు వాళ్ళ మనసులకి దెబ్బ తగలడం అసహజం అంతకన్న కాదు. ఇది నీకిప్పుడు అర్థం కాదులే నాయనా నీకు పిల్లలు పుట్టినపుడు తప్ప. మీ నాన్న అలా వెళ్ళిపోయారంటే ఆయన్ని తప్పు పట్టడానికి నీకేం హక్కులేదు. కన్నకొడుకు మాటైనా చెప్పకుండా హఠాత్తుగా

ఎవరినో కట్టుకునివస్తే హారతిఇచ్చి ఆహ్వానించేంతటి ఔదార్యం హృదయవైశాల్యం మా తరానికి ఇంకా వచ్చినట్టులేదు. మీ తరానికి ఆ మార్పు రావచ్చు. సరే ఇప్పుడింక అనుకోడానికి అర్చుకోవడానికి ఏం మిగిలింది కనుక, మేళతాళాలతో కోడలిని ఆహ్వానించే చాన్సు నీవు మాకివ్వలేదు. ఇంటికి భార్యతోవచ్చిన నిన్ను ఆమె ముందు ఏమో అని నా సంస్కారాన్ని దిగజార్చుకోను. ఉండండి వస్తున్నాను" అంటూ లోపలికెళ్ళి దేముడి ముందునించి ఇంత కర్పూరంతెచ్చి కొడుక్కి కోడలికి హారతిఇచ్చి కోడలికి బొట్టుపెట్టి "రా అమ్మా లోపలికి గడపదాటి ఎలాగో వచ్చావు. గృహప్రవేశం అయినట్టే అలా కూర్చోండి కాఫీ తెస్తాను" అంటూ లోపలికెళ్లింది కామేశ్వరమ్మ.

"నేనందుకే రావద్దన్నాను. మీరు ఉత్తరం రాసి వాళ్ళు రమ్మంటే వెడదాం అంటే మీరిలా...." భర్తవంక కోపంగా చూసి మొహం గంటుపెట్టుకుంది బబిత. "మీ నాన్నగారు చూశారా, ఎలా మొహంమీదే తలుపులు వేసి ఇన్సల్ట్‌చేశారో ఇంకా కూర్చుందాం అంటారా ఇక్కడ కావలిస్తే మీరుండండి" రుసరుసలాడింది ఆ అమ్మాయి. మురళి ఆ అమ్మాయిని శాంత పరుస్తున్నట్లు చెయ్యినిమిరి "బబితా ఇది మనం అనుకున్నదేగా. వాళ్ళ ఫీలింగ్స్‌ని మనమూ అర్థం చేసుకోవాలి. ముందు చెబితే గొడవ చేసి వద్దంటారనేగా చెప్పకుండా చేసుకున్నాం. ఈ కోపం ఎన్నాళ్లుంటుందిలే" అంటూ అనునయించాడు ఎంతైనా కన్న తల్లిదండ్రులు. రక్త సంబంధం తండ్రి ప్రవర్తన కోపం తెప్పించినా కొత్త భార్య ముందు తేలిపోవడం ఇష్టంలేక సర్దిచెప్పాడు.

కామేశ్వరమ్మ కాఫీ తెచ్చి ఇచ్చింది. "స్నానాలు చెయ్యండి–వంట చేస్తాను"

"అమ్మా మాకు శలవులేదు. మా రైలు మళ్ళీ రెండు గంటలకుంది. హనీమూన్‌కి బెంగుళూరు, మైసూరు వెళ్ళి వస్తూ వైజాగ్‌లో ఎలాగూ రైలు మారాలి కదా అని కోడలిని చూపించాలని వచ్చాను. భోంచేసి వెంటనే వెళ్ళాలి. తొందరగా వంట కానీ....ఇంకోసారి సావకాశంగా శలవుల్లో వస్తాం" అన్నాడు మురళి. కామేశ్వరమ్మ మొహం మాడిపోయింది. దారిలో రైలు మారాలి కనుక ఓ సారి దిగాడన్నమాట! ఈ మాట అనకుండా మీకు చూపించాలని వచ్చామంటే సరిపోదూ, తిన్నగా కనక రైలుంటే తల్లిదండ్రులు ఉన్నారనికూడా చూడకుండా వెళ్ళేవాడన్నమాట....హూ "గడ్డాలవాడు బిడ్డలుగాదని" ఊరికే అన్నారా నిట్టూర్చింది ఆవిడ. "సరే వంట గబగబా చేస్తాను" ముభావంగా అని లోపలికి వెళ్లింది. వంట చేస్తున్నంత సేపు ఆమె మనసు భగ్గునమండుతూనే ఉంది స్టవ్‌లా. ఆ ఉన్న రెండు గంటలలో స్నానాలు, భోజనాలు అంతా హడావిడిగా అయిపోయింది. కోడలు తిన్నానంటూ నాలుగు మెతుకులు కతికింది. అదేం పట్టించుకోక అపోరకం అయోమయ

స్థితిలో ఉండిపోయింది ఆవిడ. "అమ్మా నాన్నగారికి చెప్పు వెళ్ళాం ఇక బయటికి రమ్మని. ఆయన తనంతట పిలిచేవరకు రాను భయపడవద్దని చెప్పు." తండ్రి భోజనానికి పిలిచినా గదిలోంచి బయటికి రాలేదని మురళి మొహం మాడ్చుకుని నిష్ఠూరంగా అన్నాడు.

వాళ్ళు వెళ్ళారు. ఏదో వాన వెల్సినట్టు ఊపిరి పీల్చుకుందావిడ. కొడుకు కోడలు ఇంటికి వచ్చి వెళ్ళారన్న ఆనందం లేకపోగా ఏదో గుబులు, దిగులు ఆవిడ్ని అలుముకుంది. కొడుకు వెళ్ళాక కామేశ్వరమ్మ నాలుగైదు సార్లు పిలిస్తే కాని రాఘవరావుగారు తలుపు తీసుకుని బయటకు రాలేదు. బయటికి వచ్చిన ఆయన మొహం చూసి ఆమె జంకింది. ఆయన మాటా పలుకు లేకుండా కాళ్ళు చేతులు కడుక్కొని భోజనం ముందు కూర్చున్నారు. భర్త ఏమన్నా మాట్లాడుతారని చూసి ఆఖరికి ఆమె నిశ్శబ్దాన్ని ఛేదించింది" అంతా అయ్యాక ఇపుడేమనుకుని ఏం ప్రయోజనం. పెళ్లి చేసుకొచ్చాక మనం అనడానికి అనుకోడానికి ఏం మిగిలిందని మీరిలా బెంగపడడం. మురళికి చాలా కోపం వచ్చింది. మీరిలా పలకరించకుండా గదిలోకి వెళ్ళిపోయారని" అంతే అగ్నిపర్వతం బద్దలయినట్టు ఆయనలో కోపం లావాలా పొంగింది.

"కన్నవాళ్ళం బతికున్నా ఒక్క మాటకూడా చెప్పకుండా పెళ్ళిచేసుకున్న వాడిది తప్పుకాదు నా పెద్దరికం ఏం నిలిపాడని వాడిని ఆనందంగా ఎదురెళ్లి కౌగిలించుకోవాలా నీకంటే సిగ్గులేదు. నాకు లేదనుకున్నావా?" ఎగిరిపడ్డారాయన. "చదువయ్యేవరకు ఉద్యోగం దొరికే వరకు మన అవసరం వాడికుండేది. ఇప్పుడింక చెప్పనవసరం లేదనుకున్నాడు. పోనీ మనం అంటే అంత గౌరవం లేనివాడిని పట్టుకుని మనం ఎందుకు పాకులాడడం. కన్నందుకు మన బాధ్యత అయిపోయింది ఈనాటితో మన రుణం", ఆవేశంగా ఆవేదనగా ఎగిరిపడ్డారు.

ఆయన కోపం, పంతం ఏణ్ణర్థం వరకు చల్లపడలేదు. సమయం సందర్భం దొరికినపుడల్లా కామేశ్వరమ్మ ఆయన్ని శాంత పరచడానికి ప్రయత్నిస్తూనే వుంది. జరిగిందానికి పంతాలతో పట్టింపులతో ఒక్కగానొక్క కొడుకుని దూరంచేసుకుని సాధించేదేముందని ఎంతో నచ్చచెప్పడానికి ప్రయత్నించింది.

కాలంతో పాటు మారక తప్పదని. ఈ తరం అంతా ఇంతేనని శతవిధాల చెప్పేది. ఆయన కొడుకు పేరు ఎత్తడం మానుకున్నారు. మురళి ఎప్పుడన్నా ఏ రెండు నెలలకో ఓ ఉత్తరం రాస్తే చదవకుండానే పక్కన పడేసేవారు. కొడుకు తండ్రికి రాయడం మానుకున్నాడు. ఏ మూడు నాలుగు నెలల్లో ఓసారి తల్లికి ఎలా

ఉన్నాదంటూ రాసేవాడు. కన్నపేగు, మమకారం చంపుకోలేక మనసుండబట్టక ఆవిడ అప్పుడప్పుడు సంగతులు రాసివడేసేది.

ఏణ్ణర్థం తర్వాత మనవరాలు పుట్టిందన్న వార్త విన్న తర్వాత ఆయనలో కొంత చలనం మొదలైంది. మనవరాలి ఫోటో పంపిస్తే చూసి అంతా నీ పోలికే సుమా అంటూ ఆ ఫోటోలు మార్చి మార్చి పావుగంట చూశారు. "ఏమే వీడి దగ్గర నుంచి ఉత్తరం వచ్చినట్టే లేదు ఈ మధ్య .. పిల్ల ఎలా ఉందో ఏమిటో రాయక పోయావా" అనేవారు. భార్యకు రాసిన ఉత్తరం తీసుకు చదివేవారు. భర్తలో కొంత మార్పు వచ్చినందుకు సంతోషించిందావిడ. తండ్రి కోపం కొంత తగ్గిందని ఓ సారి రమ్మని మనవరాలిని చూడాలని ఉందంటూ రాసింది కామేశ్వరమ్మ.

ఆఖరికి మూడేళ్ల తర్వాత కూతురి మొక్కుకి తిరుపతి వెళ్తున్నాం అని తిరుగు ప్రయాణంలో వైజాగ్‌లో దిగి ఇంటికి వచ్చి మిమ్మల్ని చూసి భోంచేసి మళ్లీ రైలందుకుంటామని ఇద్దరికి అసలు సెలవు లేదని కొడుకు రాసిన ఉత్తరం చూసి అమాత్రానికే సంబరపడిపోయింది కామేశ్వరమ్మ. కొడుకు మూడేళ్ల తర్వాత ఇంటికి వస్తున్నాడు. ఆరోజు పెళ్లి చేసుకుని వచ్చిన రోజు మనసు బాగులేక కడుపు నిండా ఇంతన్నం పెట్టలేకపోయింది. ఇన్నాళ్ళకి వస్తున్నాడు కొడుక్కిష్టమైనవి నాలుగూ చేసి పెట్టాలి. వాడికి బొబ్బట్లంటే ప్రాణం. నాలుగు గరిటెలు నెయ్యి వేసుకుని ఎంత ఇష్టంగా తినేవాడు. పెరుగు గారెలు సరేసరి. ఇటొచ్చి అటొచ్చి ప్లేట్లో పెట్టుకు తినేవాడు. పులిహోరకి గడ్డపెరుగు వేసుకుంటే వాడికిష్టం. వాడికి అసలు కొత్త పిండి వంటలు గులాబుజాములు రసగుల్లాలు లాంటివి అసలు సహించవు. పండగొస్తేచాలు బూరెలు చేస్తావా బొబ్బట్లు చేస్తావా అనేవాడు. ఆవకూరలు, మెంతికూరలు ముక్కల పులుసులాంటి పాత వంటలిష్టం ఏమిటో పెర్రి నాగన్న ఇప్పుడేం తింటున్నాడో ఆ బెంగాలీ పిల్ల ఇవన్నీ ఏంచేస్తుంది. తిండికి మొహం వాచుంటాడు వచ్చిన ఒక్క పూటన్నా నాలుగుచేసి పెట్టాలని ఆవిడ ప్రాణం కొట్టుకుంది. కందిపొడుం ఊర గాయలు సర్దియిస్తే తీసికెళ్ళి తింటాడు. రైల్లో ఆ దారంట టీ నీళ్ళు కూడా దొరకవు. ఇంత మినపసున్ని జంతికలు లాంటివి చేసి ఇస్తే రైల్లో తింటాడు. ఆవిడ ఏది ముందు చెయ్యాలో తెలియక గాభరాపడి, ఆరాట పడ్తూ పనులు ఆరంభించేసింది మర్నాడు రాబోయే కొడుక్కోసం.

మూకుడు పెట్టి ముందింత మినపప్పు కమ్మగా, ఎర్రగా వేయించింది. మినప సున్ని కోసం ఆ మూకుట్లోనే కందిపొడుం కోసం పప్పులు వేయించి గ్రైండర్లో పిణ్ణి చేసింది. ఈ గ్రైండర్లు స్టవ్‌లు వచ్చి పనెంత సుఖమైంది. ఇదివరకు రెక్కలు ముక్కలు చేసుకుంటూ తిరగట్లో విసరాల్సి వచ్చేది అనుకుంది. ఇంట్లో వెన్నుంటే కాచి మినప సున్ని కలిపింది. "ఎందుకంత హైరానపడతావు వాడిప్పుడు ఇవన్నీ తింటాడనే. వాడి భార్యతో పాటు అలవాట్లు అన్నీ మారిపోయి ఉంటాయి. వాడుండే

రెండు గంటల్లో ఎన్ని తింటాడు నీ పిచ్చిగాకపోతే" రాఘవరావుగారన్నారు. "మీకు తెలియదు ఊరుకోండి. ఇవన్నీ పట్టికెడతాడు" అంది ఆవిడ చెమటలు తుడుచు కుంటూ.

తెల్లారి రోజు కంటే ఓ గంట ముందు లేచిపోయింది కామేశ్వరమ్మ. లేస్తూనే అవడలకి మినపప్పు నానబెట్టేసి లేతముప్పు వంకాయలు తరిగి పెట్టుకుంది. అనప కాయ, ములక్కాడ, దుంపలు పులుసుకి తరిగి పెట్టుకుంది. కొడుకు వచ్చేలోగా వంటపని పూర్తి చేయాలని అరగంటకల్లా మడికట్టుకుని వంటపని మొదలెట్టింది కామేశ్వరమ్మ. వంచిన తలెత్తకుండా కారిపోతున్న చెమటలు తుడుచుకోడానికైనా సైము లేకుండా తొమ్మిది గంటలకల్లా బొబ్బట్లతో సహా వంట పూర్తి చేసింది. ఇల్లంతా పోపు ఘాటుతో, సువాసనలతో గుభాళించింది.

"బాగుంది నీ వెర్రి....ఇన్ని రకాలు చేశావు. వాడేం మనిషా ఎన్ని తింటాడే ఒక్క పూటలో" రాఘవరావుగారు నవ్వుతూ అన్నారు.

"అలా అనకండి. మీ దిష్టే తగలగలదు వాడికి, మూడేళ్ళకి ఇంటికొస్తు న్నాడు. కన్నతల్లి మమకారం మీకేం తెలుస్తుంది. కిందటి సారి వచ్చినపుడు పాపిష్ఠి దాన్ని ఏం చేసి పెట్టలేకపోయాను. వెర్రి నాగన్న మన భోజనం తిని ఎన్నాళ్ళ యిందో అందావిడ ఇంత కొరివి కారంనూరి ఇంగువ నూనెకలుపుతూ, కొరివికారం ఎంతిష్టం వాడికి. ఇంతనెయ్యి వేసుకునితినేవాడు." భార్య చాదస్తానికి నవ్వుకుంటూ వెళ్ళిపోయారాయన బయటికి.

పది గంటలవుతుండగా ఇంటి ముందు టాక్సీ ఆగింది. కొడుకు కోడలు మనవరాలు దిగారు. కామేశ్వరమ్మ సంబరంగా ముందుకెళ్ళి కొడుకు చేతిలో ఏణ్ణర్థం మనవరాలిని అందుకుంది. పిల్ల రబ్బరు బొమ్మలా తెల్లగా ముద్దుగా ఉంది. నిజంగానే తన పోలిక మనవరాలిని ముద్దు పెట్టుకుంటూ "రండి రండి లోపలికి మీ నాన్నగారిని స్టేషనుకు వెళ్ళమన్నాను, ఇల్లేం వాడికి కొత్తా అన్నారు. ట్రైను లేటయినట్లుందే" అంటూ లోపలికి దారి తీసింది. గుమ్మంలో నుంచున్న రాఘవరావుగారు భార్యచేతి లోంచి మనవరాలిని అందుకున్నారు. కొడుకు వంక నవ్వుతూ చూశారు. ఆనాడు కోడలిని, కొడుకుని క్షమించలేకపోయిన ఆయన ఆ కొడుక్కి కోడలికిపుట్టిన మనవ రాలిని ఆప్యాయంగా గుండెలకత్తుకుని ముద్దులు కురిపించారు. అసలు కంటే వడ్డీ ముద్దులే ఇదే కాబోలు అనుకొని నవ్వుకుంటూ లోపలికెళ్ళింది కామేశ్వరమ్మ. కోడలు వాళ్ళ సంప్రదాయం ప్రకారం ముసుగు లాక్కొని కాళ్ళకి దండం పెట్టింది. ఆ మాత్రానికే మురిసిపోయి దీర్ఘ సుమంగళీభవ అని ఆశీర్వదించారు ఆయన.

ఏం నాన్నగారూ, మీ బ్లడ్ ప్రెషర్ ఎలా ఉందంటూ ఏం జరగనట్టే కొడుకు కుశల ప్రశ్నలతో ఆరంభించి మాటామంచిలో పడ్డారు తండ్రీ కొడుకులు.

"మురళీ కాఫీ ఇస్తాను తాగి స్నానాలు చెయ్యండి.... పెందలాడే భోజనం చెయ్యాలని టిఫిను చెయ్యలేదు. ఏకంగా భోం చేద్దురుగాని" "పదమ్మా స్నానాల గది చూపిస్తాను" అందావిడ కోడలితో.

పదకొండున్నర కల్లా టేబులంతా రకరకాల పిండివంటలతో ఆధరువులతో నింపేసింది కామేశ్వరమ్మ. ములక్కాడ వాసనతో ఘుమ ఘుమలాడే పులుసు గిన్నెలో పెట్టింది. మెంతి కారం వాసనతో నోరూరించే గుత్తి వంకాయ కూర, కొరివి కారం కంచం పక్కన ప్లేట్‌లో పల్చగా రేకుల్లా వత్తిన బొబ్బట్లు, ఇంగువ పోపుతో ఘుమ ఘుమలాడే పులిహోర, చిన్న ప్లేట్‌లో పెరుగు గారెలు, వెన్న కాచిన నెయ్యి.... టేబిలు దగ్గరికి వస్తూనే మురళీ మొహం విప్పారింది. "అబ్బ ... ఏమిటమ్మా ఇన్ని రకాలు చేశావు. ఇవాళే మన్నా పండగా. అమ్మా ఎన్నాళ్ళయిందో ఇవన్నీ తిని" అన్నాడు సంబరంగా కుర్చీ జరుపుకూర్చుంటూ.

"నీవు రావడమే పండగనాయనా నీ కిష్టమని చేశాను ఇవన్నీ" అందావిడ ఆనందంగా.

"నిన్నటి నుండి చూడాలి మీ అమ్మ హడావుడి. తెల్లారి ఐదు గంటల నుంచి వంటింట్లోనే...." అన్నారు రాఘవరావుగారు.

టేబిలు మీద ఉన్నవన్నీ చూసి బబిత ముందు తెల్లమొహం వేసి తర్వాత నుదురు చిట్లించింది. "ఏమిటి ఇవన్నీ మీరు తింటారా ఇపుడు, మతిగానీ పోయిందా మీకు" "ఏమిటది అంత ఎర్రగా ఉంది (కొరివి కారం) కారమేనా అమ్మబాబోయ్ అంత కారం తింటే ఆ కడుపు ఏమవాలి....మనుషులు తినేదేనా అసలు....ఇదేమిటి కలాచావల్ (పులిహోర) ఏవా, ఇది వరకు మా ఫ్రెండు ఇంట్లో తినివచ్చి రెండు రోజులు విరోచనాలు పట్టుకున్నాయి గుర్తులేదూ. ఆ గిన్నెలోని కర్రీ పానీ (చారు, పులుసు) ఏనా, ఆ ఇమ్లీ వాటర్ తింటే పేగులుకన్నాలు పడవు? మమ్మీజీ ఇవన్నీ ఆయనకి పడవండి. ఆ బైగన్ (వంకాయ) కూర అంత ఎర్రగా ఉంది. "అది తినబోకండి. గత ఏణ్ణర్థం నుంచి ఆయన ఏ మాత్రం కారం, పులుపు తిన్నా విరోచ నాలు, కడుపు మంట, ఆయన అప్పుడప్పుడు తెలుగు ఫ్రెండ్సింటికి వెళ్ళి ఏమన్నా తిని వచ్చాక రెండు మూడు రోజులు ఒకటే విరోచనాలు పట్టుకుంటాయి....వద్దు ఇవన్నీ తీసేయండి. ఆ మీఠావరోటా (బొబ్బట్లు) ఒకటి తిని కావాలిస్తే ఇంకా కర్డ్‌రైస్ తినండి-" అంటూ అన్నీ అతని ముందు నుంచి తీసేసింది. ఉండండి ఒక్క నిమిషం అంటూ తను తెచ్చిన బాస్కెట్‌లోంచి బ్రెడ్, జామ్, బట్టరు తీసి నాలుగు స్లైడులకి రాసి "ఇవి తిని కొంత పెరుగన్నం తినండి కావాలిస్తే, మమ్మీ

ఇవన్నీనాకు నయించవు, ప్లీజ్ తీసేయండి, బేబి అసలు తినదు నేనూ ఒక్క మీతా పరోటా తింటాను" అంది, అన్ని దూరంగా జరిపేస్తూ నిక్కచ్చిగా "మురళి మొహం పాలిపోయింది ఏదో చెప్పబోయాడు ఆశగా తినబోతుంటే నోటి ముందు విస్తరి లాగేసినట్టు అతని కళ్ళల్లో నిరాశ, బేలతనం స్పష్టంగా కనిపించింది కామేశ్వరమ్మకి.

రాఘవరావుగారు తెల్లబోతూ కొడుకు భార్య వంక చూశారు. కామేశ్వరమ్మ అయితే దిగ్భ్రాంతిగా వెర్రిదానిలా కోడలి వంకా, కొడుకు వంకా చూసింది. నిన్నటి నుంచీ రెక్కలు ముక్కలు చేసుకుని వంచిన నడుం ఎత్తకుండా కన్న కొడుక్కి పెట్టుకోవాలని. చేసినదంతా తినడానికి వీలులేదని శాసిస్తున్న కోడలు ఆవిడ కంటికి రాక్షసిలా కన్పించిది. తల్లి మొహం, భార్య మొహం చూసి "ఈ ఒక్క రోజుకేగా. రోజూ తింటానా-ఒక్క రోజుకి...." నసుగుతూ అన్నాడు మురళి.

"వో ఈ రిచెడ్ ఫుడ్ తిని వారం రోజులు బాధపడతారు మీరు వీల్లేదు" శాసిస్తున్నట్లు అంది.

కామేశ్వరమ్మ మొహంలోకి ఒక్కసారిగా రక్తం పొంగింది 'రెచెడ్ ఫుడ్' కడుపు తీపితో మూడేళ్ళ తర్వాత వచ్చిన కొడుక్కి ఇష్టమైనవి పెట్టుకోవాలని తాపత్రయ పడి మమతానురాగాలు రంగరించి వండిన ఈవంట రెచెడ్ ఫుడ్డా? ఒకతల్లి కన్నబిడ్డకి కడుపునిండా పెట్టుకోనీయకుండా అడ్డుపెట్టడానికి ఇది ఎవర్తి? ఆవిడలో ఆవేశం, ఆక్రోశం, ఉక్రోషం కట్టలు తెంచుకుంది. భద్రకాళిలా రౌద్రమూర్తి అయింది. తర్జని చూపిస్తూ "ఇదిగో కోడలుపిల్లా నీవు ముందు అక్కడ నుంచి లే నీవు నీ రొట్టె ముక్కలప్లేటు పట్టికెళ్ళి డ్రాయింగు రూంలోకి పద. అక్కడ కూర్చుని ఆ గడ్డితిను. నీ కుమారిని కూడా తీసికెళ్ళు కావలిస్తే, జబ్బు దానిలా దానికీ ఆ రొట్టె ముక్కలు తినిపించు. నా కొడుక్కి ఏం కావాలో ఏం పెట్టుకోవాలో నాకు తెలుసు. పాతికేళ్లనాడు ఈ భోజనం తిన్నాడు. వాడి కడుపు అప్పుడేం కన్నాలుపడలేదు. వాడేం తింటాడో కన్నతల్లిని నా కంటే నీ కెక్కువ తెలుసా? ఈ మూడేళ్ళుగా వాడికి రోజూ రొట్టె ముక్కలే పెట్టి వుంటావు. అందుకేవాడి కడుపు ఎండిపోయి ఏం తిన్నా వాడికి పడడం మానేసి వుంటుంది. నీ చప్పిడి కూడు తిని కొత్త పులుసు కారం తగిలితే వాడికి కడుపు నొప్పి వస్తుందేమో. మాది రెచెడ్ ఫుడ్డా....చూడు కోడలా మీరు చొంగకార్చుకుంటూ తింటారే....ఆ మచ్చీ ఆ చేపలు అవిమాకు రోత, కంపు....అలా అని మేం అంటే నీవు తినడం మానేస్తావా. మా చారుపులుసు మీ కంత వేళాకోళమా. మీరు ఆ మచ్చీ జోళ్ (చేపలకూర నీరు) జుర్రుకుంటూ తింటారే అది మాకు కడుపులో వికారం. ఏం చేస్తాం మీకు అమృత

మైంది మాకు రోత. ఎవరి తిండి అలవాట్లువాళ్ళవి. చదువుకున్నదానివి ఇంకోరి తిండి అలవాట్ల గురించి అంత తిరస్కారంగా మాట్లాడుతావా, ఇదేనా నీ చదువు, సంస్కారం, మాది గొడ్డుకారమా....ఆ ఎర్ర మిరప వళ్ళపచ్చడి....ఇంత చింత పండు, ఉప్పుకలిపి నూరిఇంగువ నూనె కాచిపోస్తాం, ఆ కారం తగ్గడానికి, నెయ్యి వేసుకుని తింటే ఉంటే రుచి నీకెలా తెలుస్తుంది. ఆ ఇఖ్లిపాసీ అంటూ వెక్కిరిం చావే. ఆ వారుతో మిరియాలు, ధనియాలు అవి తిన్నతిండి అరగడానికి పనికొస్తుందని మీకేం తెలుసు. మేము ఒక్కోకూరమ ఒక్కో రుచితో వండుకుంటాం. మీలా అన్నిట్లో ఇంత అల్లం, వెల్లుల్లి, గరం మసాలా పడేసుకుని అన్ని కూరలూ ఒకటే రుచితో ఉండవు. ఇదిగో ఈ వంకాయనే పది రకాలుగా వండుకుంటాం. పచ్చికారం, మెంతి కారం, ఉల్లికారం, జీలకర్ర కారం, పచ్చిపులుసు, ముద్ద ఒక్కోరకం చేసు కుంటాం. కూరలో దోషాలు పోవడానికి అవపెట్టి, అల్లం పెట్టి, పులుసు వేసి విరుగుడికోసం రకరకాలుగా వండుకుంటాం. మా తెలుగువారి నోటికి షడ్రుచులు కలగాలి. మా కారం చావడానికి మేం గొడ్డు తిండి తినం. ఇంత నెయ్యో నూనో వేసుకుంటాం. ఆఖర్న కడుపుకి హాని చెయ్యకుండా ఉండడం కోసం పెరుగు, మజ్జిగ అన్నం తింటాం. ఎంత బీదవారమైనా మజ్జిగ తినకుండా ఉండం.... మాది రెచెడ్ ఫుడ్డా—ఏది ఈ బొబ్బట్లు శనగపప్పు పంచదారతో చేసినవి రెండు గంటెలు నెయ్యి వేసుకుని తిను. మీకేజి చేపల కంటే బలమోకాదో తక్కెడలో వేసుకుని తూచి చూసుకో. మా పప్పులన్నీ వేసిన కందిగుండు రెండు చంచాలు అన్నంలో వేసుకుని ఇంత నెయ్యి వేసుకుని తింటే మీ మాంసం కంటే ఏ విషయంలో తీసి పోతుందో తేల్చి చెప్పు. పొద్దుటే మీరు లేచి రసగుల్లాలు తింటే మాకు వింత, పొద్దుటే ఇదేం తిండి అని అలా అని మేం నవ్వితే నీ కెలా ఉంటుంది. దేముడి సృష్టిలో పనికి రానిదేం ఉండదు. ప్రతిదానికి ఏదో ఒక ఉపయోగం ఉంటుంది. మన పూర్వులు భోజన అలవాట్ల వాతావరణంబట్టి అక్కడ దొరికే వస్తువుల బట్టి తయారుచేసేవారు. ఏదన్నా ఓ పదార్థం చెరుపు చేస్తుందంటే దానికి విరుగుడు కని పెట్టి వండేవారు. ఎవరి ఆచారాలు, ఎవరి భోజన అలవాట్లువారివి. ఇంకోరి భోజనాన్ని వెక్కిరించి, విమర్శించే హక్కు నీకెవరిచ్చారు. నీలా ఇంజనీరింగులు, డాక్టర్లు చదవకపోయినా నాలుగు ఇంగ్లీషు ముక్కలు నాకూవచ్చు. మాది రెచెడ్ ఫుడ్డా—కాస్త నోరు సంభాళించుకుని మాట్లాడు. వాడికి తిండి పెట్టకుండా మాడ్చి వాడి కడుపు ఎండబెట్టి ఏం తిన్నా పడకుండా చేసింటావు. ఆశగా భోజనంముందు కూర్చున్నవాడి నోటిముందు విస్తరిలాగేస్తావా.... లే ముందు అక్కడనుంచి నీకు తినడం ఇష్టంలేకపోతే వెళ్ళి డ్రాయింగు రూంలో కూర్చో. ఈ రోజు నాకొడుక్కి నాఇష్టం వచ్చిన భోజనం పెట్టుకుంటాను. పిల్ల తల్లి వి కన్న కడుపుతీపి నీ కర్థం

కాలేదా ఇంకా, ప్రేమించి పెళ్ళి చేసుకున్నంత మాత్రాన కన్నవాళ్ళనుంచి దూరం చేసే అధికారం నీకెవరిచ్చారు? శలవులు వచ్చేసరికి పుట్టింటికి కలకత్తా పరిగెడతావే. మీ అమ్మ నిన్ను కన్నట్టే వాడి అమ్మను, వాడిని నేనూ కన్నాను. మూడేళ్ళ తర్వాత మూడు గంటలు ఉండిపోవడానికివస్తారా. ఉన్న ఒక్కపూటైనా మొగుడి కిష్టమైనవి తిననీయవు. నిజంగా నీవేవాడిని ప్రేమించి పెళ్ళాడిఉంటే వాడికేంకావాలో ఏ ఏదిష్టమో తెలుగమ్మాయినో అడిగి మావంటలువండి పెట్టేదానివి వాడికి. తల్లికడుపు చూస్తుంది, పెళ్ళాం జేబులు చూస్తుందంటారు. నీ కిష్టమైన రసగుల్లాలు చేపలు వాడూ తినాలా అవే.... నీ పూరుకోరా వాజమ్మా మాట్లాడకు....నీవు గనక కంచం ముందు నుంచి లేచావంటే తలపగలగొట్టుకుని చస్తాను, నీవు ఇంత బెదురుతున్నావు గనుకే వి స్తరి ముందు కూడు లాగగల్గింది. నీ కోసం రెక్కలుముక్కలు చేసుకు చేశాను. తిని మరీ కదులు...." భద్రకాళిలా గర్జించింది కామేశ్వరమ్మ ఎర్రబడిన ఆమె కళ్ళు, మొహం ఆ ఆవేశం చూసి బబిత బిక్కచచ్చిపోయి, నల్లబడ్డ మొహంతో విసవిస లేచి పోయింది. భార్య వెళ్ళగానే గాభరాగా లేవబోయిన మురళీని భుజం పట్టుకు కుదేసి అదిమి...."ఎందుకురా అంత భయపడతావు. ఏం చేస్తుందిరా....మహాఅయితే అదిగో టాక్సీ ఎక్కి కూర్చుంది. పోనీ, స్టేషనుకి పోతుంది. రైలుకింకా రెండు గంటలు టైముంది. స్టేషనులో కూర్చుంటుంది. ఏం విడాకులు ఇచ్చేస్తుందనాభయం. ఈ మాత్రానికే తుమ్మితే ఊడే ముక్కునుపట్టుకు ఎన్నాళ్ళు భయపడతావు....మహా రాజులా ఇమ్మను. ఇచ్చిన మర్నాడు అయినింటి తెలుగమ్మాయిని దాని కళ్ళముందే ఇచ్చి పెళ్ళిచేస్తాను...." తెల్లబోయి చూస్తున్న భర్తని, బిక్కచచ్చిపోయిన కొడుకునీ చూస్తూ....

"ఏమిటలా చూస్తున్నారు ముందు మీరిద్దరూ మొదలు పెట్టండి అన్నీ చల్లారి పోతున్నాయి." నెయ్యి వడ్డిస్తూ గదమాయించింది. మురళి ఇంకేం మాట్లాడకుండా గబగబా అన్నం తినడం మొదలుపెట్టాడు. మూడేళ్ళ తర్వాత సుష్టుగా తల్లిచేతి వంట రుచి చూస్తూ తిన్నాడు. తింటున్నంత సేపూ వీధి గుమ్మం వైపు ఓ కన్ను, ఓ చెవి వేసి ఉంచాడు. కొడుక్కి అడిగి అడిగి సంతృప్తిగా వడ్డించింది కామేశ్వరమ్మ.

కొడుకు అన్నం తిని "అమ్మా బబిత ఏదో అంటే నీవూ అంత తొందర పడాలా చూడు కోపం వచ్చి ఎలా టాక్సీలో కూర్చుందో. ఇంక మళ్ళీ రాదేమో ఇక్కడికి...." అన్నాడు సామానుపట్టుకుని. "ఏం తప్పు మాట అన్నానురా? కోపం వస్తే ఏం చేస్తుంది. మహా అయితే ఇక్కడికి రావడం మానేస్తుంది అంతేగా. ఇపుడు మహా వస్తున్నారు గనుకనా" నిర్లక్ష్యంగా అంది కామేశ్వరమ్మ. కొడుకు సామాను టాక్సీలో చేరవేస్తుంటే కామేశ్వరమ్మ ఓ పళ్ళెంలో చీర, రవిక పండూ తాంబూలం ఊరగాయల బుట్ట పట్టుకుని టాక్సీదగ్గరికి వెళ్ళింది. బబిత జరుగుతున్న

దానితో సంబంధం లేనట్టు మొహం గంటు పెట్టుకుని ఓ పుస్తకం మొహానికి అడ్డు పెట్టుకుంది చదువుతున్నట్లుగా "ఇదిగో కోడలా, కొత్త మొహం ఇటు తిప్పితే బొట్టు పెడతా. ఇదీ మా తెలుగువాళ్ళ ఆచారం. ఇంటికొచ్చిన సుమంగళికి బొట్టూ, రవిక ఇవ్వడం. ఈ చీర నీహోదాకి సరిపోతే కట్టుకో లేదంటే నీ పనిమనిషికి నా పేరు చెప్పి ఇయ్యి, సంతోషంగా కట్టుకుంటుంది." అంటూ బొట్టు పెట్టి చీర రవిక పసుపు కుంకం చేతిలో పెట్టింది. బబిత మొహం నల్ల పరుచుకుని ఏం మాట్లాడలేదు. పక్కనున్న మనవరాలి బుగ్గలు పుణికి 'ఇదిగో నా మనవరాలి కోసం అని మురిపెంగా పట్టుపరికిణీ కట్టి చూడాలని కుట్టించాను. ఇది నీ ఫేషనుకు సరిపోతే దానికి తొడుగు. ఒరేయ్ మురళీ నీకు పుట్టిన పాపానికి మీ ఆవిడికిష్టంలేకపోయినా అది తెలుగింటి ఆడబడుచే అవుతుంది దానికి నాలుగు తెలుగు మాటలు నేర్పు. కొత్త తెలుగురుచులు అలవాటు చెయ్యి. కన్నతల్లి ని, పుట్టిన నేలని, తొలి పలుకులుపలికిన మాతృభాషని మర్చిపోవడం పాలుతాగి రొమ్ముగుద్దినట్లే అవుతుందిరా. ప్రేమించి పెళ్ళాడినంత మాత్రాన మన భాష, మన సంస్కృతి, మన అలవాట్లు మర్చిపోనక్కరలేదు. అది నీవు తెలుసుకుంటే కన్నవాళ్ళం ఉన్నన్ని రోజులు ఏడాదికోనాడైనా మొహం చూపించుతావు. చూడమ్మా బబితా, నీది కన్నతల్లి మనసు అని నీవూ ఓ తల్లివి గనక అర్థం చేసుకోగలిగితే నేనన్న మాటలకి కోపం తెచ్చుకోవు....వెళ్ళి రండి నాయనా" అంటూ పట్టుకొన్న గొంతుతో అని చమర్చిన కళ్ళు వత్తుకుంటూ ఆవిడ వెనుదిరిగింది. టాక్సీ కదిలింది.

జరుగుతున్నదంతా నోట మాటలేనట్టు ప్రేక్షకుడిలా ఇంతసేపూ చూస్తున్న రాఘవరావుగారు లోపలికొచ్చిన భార్యని చూసి "శభాష్, కాముడూ, ఈ రోజు నీలో ఈ ముప్పై ఐదేళ్ళలో ఎన్నడూ చూడని అవతారాలని చూశాను. అనురాగం, మమత నింపుకున్న తల్లి ని, తన బిడ్డకు ఎవరు హాని చేసినా ఏ పక్షి, జంతువు సహించదు అలా దరిచేరిన వాళ్ళని చీల్చి చెండాడుతుంది, అలాంటి ఆవేశం రౌద్రం....జగజ్జననిలా, చండిలా, కాళిలా కన్నకడుపుకోసం పోరాడే తల్లి ని, తన నుంచి బిడ్డను వేరుచేస్తే పడే ఆవేదనని, ఆక్రోశంలో ఆతల్లి పడే ఆరాటాన్ని.... మాతృమూర్తి అంటే ఏమిటో నీలో చూశానివాళ. నమో మాతః నమో జగదైక మాతా, నమోనమః" అంటూ నవ్వుతూ నమస్కారం చేశారు రాఘవరావుగారు.

"చాల్లెండి ఊరుకోండి ఏమిటో వెర్రి ఆవేశం వచ్చేసింది. వాడెంతో ఆరాటంగా ఆశగా తినాలనుకుంటుంటే నోటి ముందు విస్తరిలాగేసరికి కోపం పట్ట లేక పోయాను, ఏమనుకుంటో ఆ అమ్మాయి." సిగ్గుపడ్తూ కళ్ళు తుడుచుకుంది కామేశ్వరమ్మ.

"బుద్ధి జ్ఞానం ఉంటే అనుకోకూడదు మరి. ఓ తల్లి మనసు గుర్తించగలిగితే ఏమనుకోదు" అన్నారాయన.

(ఉదయం ఉగాది ప్రత్యేక సంచిక. 1990)